సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం ౹ 10 ౹ ఫిబ్రవరి ౹ 2025



సోమశిలలో 64.850 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 64.850 టీఎంసీలు ఉన్నాయి. 1025 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 4000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.87,650
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,945
3 శాతం జీఎస్టీతో	రూ.8,183
నవర (8 గ్రా)	రూ.65,464

గరిష్టం/కనిష్టం
32.4 /24.5

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుందని ఆ శాఖాధికారులు తెలిపారు. ఆదివారం గాలిలో తేమ 61 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

రైతుల పథకాలకు ప్రత్యేక కోడ్

• జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి

నెల్లూరు(సెంట్రల్): ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన పోర్టల్‌లో రైతుల పథకాల కోసం నమోదు చేసుకుంటే ప్రత్యేక కోడ్ వస్తుందని, ఆ కోడ్ నంబర్ ఉంటేనే పథకాలు అందుతాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుకు సంబంధించి పొలం వివరాలను సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో అందించి పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సబ్సిడీ, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంటల రుణాలపై వడ్డీ రాయితీ, పెట్టుబడి సాయం ఇలా ప్రభుత్వం నుంచి ఏ పథకం తీసుకోవాలన్నా తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 28వ తేదీ లోపు ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.

పశుగణన పూర్తి చేయాలి

నెల్లూరు (సెంట్రల్): జిల్లాలో జరుగుతున్న పశుగణన ప్రక్రియను ఈ నెల 28వ తేదీ లోపు పూర్తి చేయాలని పశుగణన జిల్లా నోడల్ అధికారి ఆర్.మంజునాథ్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 91 శాతం పూర్తి చేశారన్నారు. పశువుల లెక్కలు ప్రభుత్వం వద్ద ఉంటే, పాడి రైతులకు వచ్చే పథకాలు కూడా అందజేసేందుకు వీలుగా ఉంటుందన్నారు. గడువు లోపల పశుగణనకు కేటాయించిన టీం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పూర్తి చేయాలని సూచించారు.

సూర్యఘర్ ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

• ఎస్‌ఈ విజయన్



సోలార్ ఎక్స్‌పోలో పాల్గొన్న ఎస్‌ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పీఎం సూర్యఘర్ బిజిలీ యోజన పథకం ప్రయోజనాలపై ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కలిగించాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ అధికారులకు సూచించారు. నగరంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో ఆదివారం సాయంత్రం సోలార్ విద్యుత్ వినియోగంపై రామూర్తినగర్ సబ్‌డివిజన్ డీఈఈ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సోలార్ వెండర్స్‌తో సోలార్ ఎక్స్‌పో ఏర్పాటు చేశారు. ఎస్‌ఈ మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు సోలార్ విద్యుత్ ఉపయోగపడుతుందన్నారు. 25 ఏళ్ల గ్యారెంటీతో ఈ సోలార్ ప్యానల్స్ ఏర్పాటుతో పెట్టిన పెట్టుబడి 5 ఏళ్లలో తిరిగి వస్తుందని, మిగిలిన 20 ఏళ్లు విద్యుత్ ఉచితంగా పొందచ్చన్నారు. సూర్య ఘర్ నోడల్ ఆఫీసర్, విద్యుత్‌శాఖ ఈఈ శేషాద్రిబాలచంద్ర, 17వ డివిజన్ కార్పొరేటర్ సుధాకర్, చిల్డ్రన్స్ పార్క్ పౌండర్ రమణయ్య, ఏఈలు గోపాలకృష్ణ, మునిశేఖర్, సురేష్, విజయ్‌కుమార్, జూనియర్ ఇంజినీర్స్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



టిడ్కో భవనాల వద్ద రామాలయ నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రులు

ఆత్మకూరు: రాష్ట్రంలో అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారని మంత్రులు మంత్రి ఆనం, నారాయణ, జనార్దన్‌రెడ్డి, సవిత, ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణ పరిధిలో టిడ్కో భవనాల వద్ద నూతన రామాలయ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని ప్రారంభించారు. పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహానికి శంకుస్థాపన చేశారు. బీసీ బాలికల గురుకుల పాఠశాల కోసం తాత్కాలిక భవనం ప్రారంభోత్సవం, సరస్వతీ విగ్రహం ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో ఆనం మాట్లాడుతూ బీసీ బాలికల కోసం గతంలోనే మంజూరైన రెసిడెన్సియల్ పాఠశాల సాంకేతిక కారణాలతో నిలిచిపోయిందన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని 63 ప్రాంతాల్లోని టిడ్కో భవనాల వద్ద రామాలయాల నిర్మాణం కోసం రూ.20 లక్షలు చొప్పున దేవదాయశాఖ నిధులతో నిర్మించనుండడం మంచి సాంప్రదాయమన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 13 వేల కి.మీ.రోడ్లను పీపీపీ పద్ధతి ద్వారా ఏప్రిల్, మే నెలల్లోపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు మంత్రి సవిత మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి రూ.39 వేల కోట్లు నిధులు మంజూరు చేసి 1.39 లక్షల మంది స్వయం ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మంత్రి నారాయణ నియోజకవర్గానికి తాను ఎంపీ ల్యాడ్స్ ఇవ్వాల్సిన అవసరం లేదని, ఆయనే సమకూర్చుకోగలరన్నారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, ఆర్డీఓ బి.పావని, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కె శ్రీనివాసులురెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల బియ్యం.. పెద్దల భోజ్యం



కోవూరు నియోజకవర్గం మాఫియాలకు అడ్డాగా మారింది. సహజ వనరుల దోపిడీ నుంచి పేదలు తినే బియ్యం వరకు షాడో ఎమ్మెల్యే కనుసన్నల్లో మాఫియా గాళ్లు దోచుకుంటున్నారు. ఇసుక, గ్రావెల్, చికెన్ వేస్ట్ మాఫియాలే కాదు తాజాగా రేషన్ బియ్యం మాఫియా తయారైంది. ఎర్రచందనం స్మగ్లింగ్‌లో ఆరితేరిన ఓ వ్యక్తి బియ్యం మాఫియాకు రింగ్ లీడర్‌గా వ్యవహరిస్తున్నారు. బుచ్చిరెడ్డిపాళెం కేంద్రంగా రేషన్ మాఫియా నెలకు వేల టన్నుల బియ్యం చెన్నై మీదుగా విదేశాలకు అక్రమ రవాణా జరుగుతోంది.

బుచ్చిరెడ్డిపాళెం కేంద్రంగా రేషన్ మాఫియా

- నెలకు 2 వేల నుంచి 3 వేల టన్నులు సేకరణ, తమిళనాడుకు ఎగుమతి
- ప్రతినెలా రూ.20 కోట్ల వ్యాపారం
- విలియన్స్‌పేటలోని రైస్‌మిల్లులో పాలిష్
- సోనామసూరి బియ్యం పేరుతో బ్రాండెడ్ బస్తాల్లో ప్యాకింగ్
- షాడో ఎమ్మెల్యేకు నెలకు 10 శాతం కమీషన్
- పోలీసులు, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులకు మామూళ్లు

రెండు వారాలే వ్యాపారం



ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా బియ్యం పేదలకు సరఫరా అవుతుంది. అయితే అదే సమయంలో నేరుగా రేషన్ షాపులు, ఎండీయూ వాహనాల నుంచి సేకరించి విలియన్స్‌పేటలోని రైస్‌మిల్లులో రేయింబవళ్లు పాలిష్ పట్టిస్తున్నారు. ఆ తర్వాత బ్రాండెడ్ బ్యాగుల్లో ప్యాక్ చేసి నాణ్యమైన బియ్యంగా తమిళనాడుకు తరలిస్తున్నారు. నెలలో మొదటి రెండు వారాల్లోనే ఈ బియ్యాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటించేస్తున్నారు. ప్రతి వాహనంలో దాదాపు 30 టన్నుల వంతున లోడింగ్ చేస్తున్నట్లు సమాచారం. దాదాపు 100 టర్బో లారీల్లో ఈ బియ్యాన్ని తరలిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అధికార పార్టీ నేతల ధన దాహం తీరడం లేదు. సహజ వనరులైన ఇసుక, గ్రావెల్‌తో రూ.వందల కోట్లు దోచుకుంటున్న వీరు ఇప్పుడు ప్రజల ఆరోగ్యంతోపాటు వారి కడుపులు కొట్టి తమ ఖజానాలు నింపుకుంటున్నారు. కోవూరు నియోజకవర్గం నుంచి గొప్పంటి మహిళ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, పేద ప్రజలు కష్టాలు తెలిసిన మహిళగా తమ కష్టాలు తీరుతాయని భావించిన ప్రజలు ఆశలు సమాధి అయ్యాయి. వేదికలెక్కి ఇచ్చే ఉపన్యాసాలకు.. తెర వెనుక చేసే దందాకు పొంతనే ఉండడం లేదని చర్చించుకుంటున్న పరిస్థితి కనిపిస్తుంది. గడిచిన తొమ్మిది నెలల్లో కోవూరు నియోజకవర్గాన్ని 'కరి మింగిన వెలక్కాయ' మాదిరిగా మార్చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మాఫియాను పెంచి పోషిస్తూ..

కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే షాడోలను అడ్డం పెట్టుకుని ఇసుక, గ్రావెల్, చికెన్ వేస్ట్ బియ్యం మాఫియాలను పెంచి పోషిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే కోవూరు నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు తావులేదంటూ తొలి ఉపన్యాసం ప్రారంభిస్తుంటారు. కానీ వాస్తవం చూస్తే.. ఇసుక, గ్రావెల్ మాఫియాను అరికట్టడం దేవుడు ఎరుగు.. జిల్లాలోనే ఇక్కడి మాఫియా టాప్‌లో ఉందంటే అతిశయోక్తి కాదు. రెండు నెలల్లో చికెన్ వేస్ వ్యాపారానికి అడ్డుకట్ట వేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు టీడీపీ నేతల అండతో రెండింతలు అక్రమ రవాణా పెరిగినట్లు సమాచారం. తాజాగా రేషన్ మాఫియా మొదలైంది.

ఎర్రచందనం స్మగ్లరే బియ్యం స్మగ్లర్

జిల్లా నుంచి చెన్నైకు ఎర్రచందనం అక్రమ రవాణాలో ఆరితేరిన ఓ స్మగ్లర్ ఇప్పుడు రేషన్ బియ్యం స్మగ్లర్‌గా మాఫియా అవతరించారు. నెల్లూరు టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ కోవూరు ఎమ్మెల్యేకు షాడోగా వ్యవహరిస్తున్న ముఖ్యనేత అనుచరుడే ఈ ఎర్రచందనం స్మగ్లర్. ప్రస్తుతం రేషన్ మాఫియాకు రింగ్ లీడర్‌గా వ్యవహరిస్తున్నాడు. స్మగ్లర్‌తోపాటు మరో ఇద్దరు కలిసి రేషన్ బియ్యం దందాకు తెర తీశారు. కోవూరు నియోజకవర్గంతో పాటు సమీప నియోజకవర్గాల్లో ఉన్న రేషన్ బియ్యాన్ని సేకరించేందుకు ఓ ప్రత్యేక ముఠాను తయారు చేశారు. రేషన్ డీలర్లతో పాటు ఎండీయూ వాహనాల నుంచి రేషన్ బియ్యం కేజీ రూ.16 వంతున కొనుగోలు చేసి సేకరిస్తున్నారు. ప్రతి నెల 2 వేల నుంచి 3 వేల టన్నుల వరకు బియ్యాన్ని సేకరిస్తున్నట్లు సమాచారం. బుచ్చిరెడ్డి పాళెంలోని నాగామాంబపురంలో విలియన్స్ పేటలో ఉన్న ఓ రైస్‌మిల్లుకు చేర్చి అక్కడే రీసైక్లింగ్ ప్రక్రియ చేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టి కర్నూలు సోనామసూరి, సాధారణ మసూరి రకాలతో బ్రాండెడ్ బ్యాగుల్లో ప్యాక్ చేసి తమిళనాడు మార్కెట్‌కు తరలిస్తున్నారు.

చెన్నై మార్కెట్‌లో కేజీ రూ.78

రేషన్ మాఫియా ఇక్కడ కేజీ రూ.16లకు కొనుగోలు చేసి రీసైక్లింగ్ చేసిన తర్వాత చెన్నైలో కేజీ రూ.78 వరకు విక్రయాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన ప్రతి ముప్పై టన్నుల లారీ బియ్యం ఇక్కడ రూ.4.80 లక్షలకు కొనుగోలు చేస్తే.. చెన్నైలో అదే సరుకును రూ.23.40 లక్షలకు విక్రయిస్తున్నారు. ఈ విధంగా ప్రతి లారీకి రూ.19.40 లక్షలు మిగులుతోంది. నెలకు సుమారుగా రూ.20 కోట్ల మేర సంపాదిస్తున్నట్టు తెలుస్తోంది.

షాడోతోపాటు అధికారులకు మామూళ్లు



రేషన్ దందాకు అండగా నిలిచిన కోవూరు షాడో ఎమ్మెల్యేకు చెందిన లీడర్‌కు నెలకు పది శాతం కమీషన్ ముట్టుచెబుతుండగా, పోలీసులు, విజిలెన్స్, పౌరసరఫరాలశాఖ, రెవెన్యూ అధికారులకు మామూళ్లు అందజేస్తున్నట్లు సమాచారం. దీంతో రేషన్‌దందాకు అడ్డుచెప్పే పరిస్థితి కనిపించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రైస్‌మిల్లుల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తాం

బుచ్చిరెడ్డిపాళెం కేంద్రంగా ఓ రైస్‌మిల్లులో రేషన్ బియ్యం రీసైక్లింగ్ వ్యవహారంపై నా దృష్టికీ వచ్చింది. ఉన్నతాధికారుల సూచనలు తీసుకుని విచారణ జరుపుతాం.. తనిఖీలు నిర్వహించి బియ్యం రిసైక్లింగ్ చేస్తుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. బియ్యం ఎక్కడి నుంచి వస్తున్నాయో కూడా పరిశీలించి అడ్డుకట్ట వేస్తాం.

– అంకయ్య, ఇన్‌చార్జి డీఎస్‌ఓ

ప్రాక్టికల్స్.. ప్రహసనమే

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు ముందు నుంచే కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఇంటర్ బోర్డు అధికారుల మధ్య ఒప్పందాలు కుదిరిందనే ప్రచారం జోరుగా జరుగుతోంది. తమ విద్యార్థులకు చెప్పిన విధంగా మార్కులు వేసేందుకు వారితో అవగాహన కుదుర్చుకున్న విషయం ఓపెన్ సీక్రెట్. ప్రాక్టికల్స్ వెళ్లి మీకు తెలిసింది చేయండి.. ఆ తర్వాత మేం చూసుకుంటాం అని విద్యార్థులకు చెబుతున్నట్లు తెలిసింది. నాన్ జంబ్లింగ్ పద్ధతిలో ఏ కళాశాల విద్యార్థులు ఆ కళాశాలలోనే ప్రాక్టికల్స్‌కు హాజరవుతున్నారంటే ఈ పరీక్షల్లో పారదర్శకత ఎక్కడ ఉంటుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



ప్రాక్టికల్స్‌కు హాజరైన విద్యార్థులు (ఫైల్)

- నేటి నుంచి నాన్ జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహణ
- ఏ కళాశాల విద్యార్థులు ఆ కళాశాలలోనే పరీక్షలు
- సీసీ కెమెరాల సాక్షిగా మాస్ కాపీయింగ్‌కు ప్లాన్
- ఎగ్జామినర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో ముందే ఒప్పందం
- బైపీసీ విద్యార్థి నుంచి రూ.2 వేలు, ఎంపీసీకి రూ.1,000

నెల్లూరు (టౌన్): జిల్లాలో సోమవారం నుంచి ఇంటర్మీయట్ జనరల్ ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయి. క్షేత్రస్థాయి నుంచి బోర్డు స్థాయి వరకు ఒప్పందాలు జరిగిపోవడంతో ప్రాక్టికల్స్.. ఒక ప్రహసనమే అని స్పష్టమవుతోంది. ప్రాక్టికల్స్ పరీక్షలను సీసీ కెమెరాల నిఘా నీడలో నిర్వహిస్తున్నామని గొప్పగా చెబుతున్నప్పటికీ.. అదే సీసీ కెమెరాల మాటున మాస్ ప్రాక్టికల్స్ జరగబోతున్నాయని సమాచారం.

ప్రాక్టికల్స్‌కు 23,507 మంది విద్యార్థులు

ఇంటర్మీడియట్ జనరల్ ప్రాక్టికల్స్‌కు మొత్తం 23,507 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. బైపీసీ 19,864 మంది, ఎంపీసీ 3,823 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రాక్టికల్స్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండు విడతల్లో జరగనున్నాయి. మొత్తం 121 సెంటర్లలో రెండు విడతల్లో ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు 121 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 121 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను, సుమారు 400 మంది ఎగ్జామినర్లను నియమించారు.

విద్యార్థుల నుంచి డబ్బుల వసూళ్లు

ప్రాక్టికల్స్ పేరుతో ఆయా కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి డబ్బులు వసూళ్లు చేసినట్లు తెలిసింది. బైపీసీ విద్యార్థులు అయితే రూ.2 వేలు, ఎంపీసీ విద్యార్థులు రూ.1000 వంతున ఇచ్చినట్లు విద్యార్థులే చెబుతున్నారు. ప్రాక్టికల్స్‌లో బైపీసీ విద్యార్థులకు 120 మార్కులు, ఎంపీసీ విద్యార్థులకు 60 మార్కులుంటాయి. అయితే కార్పొరేట్ విద్యార్థులకు కనీసం రసాయనాలు పేర్లు కూడా తెలియదని చెబుతున్నారు. కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు అనాథరైజ్డ్ బ్రాంచ్‌ల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. అనాథరైజ్డ్ బ్రాంచ్‌లో ఉన్న విద్యార్థులు ప్రాక్టికల్స్ కోసం అడ్మిషన్ ఉన్న బ్రాంచ్‌కు వచ్చి ప్రాక్టికల్స్ చేయాల్సి ఉంటుంది. జిల్లాలో మెజార్టీ సెంటర్లలో సీసీ కెమెరాలు బిగించని పరిస్థితి ఉంది. ఒక వేళ బిగించినా వాటి దిశ మార్చి యథేచ్ఛగా ప్రాక్టికల్స్‌లో మాస్ కాపీయింగ్ చేస్తున్న పరిస్థితి ఉంది.

ముందే ఒప్పందం

కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ముందుగానే ఇంటర్ బోర్డు అధికారులతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. రూ.లక్షల్లో చేతులు మారాయన్న ప్రచారం జరుగుతోంది. ప్రాక్టికల్స్‌కు వచ్చిన ఎగ్జామినర్‌కు ఒక్కో విద్యార్థికి రూ.300 నుంచి రూ.500 వరకు అందజేస్తున్నట్లు తెలిసింది. ఆయా యాజమాన్యాలు ముందుగానే విద్యార్థులకు మైక్రో జెరాక్స్‌లు చేయించి ఇస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొన్ని సెంటర్లలో నేరుగా ఎగ్జామినర్లే చెబుతున్న పరిస్థితి ఉంది. ఏ పూట జరిగే పరీక్షకు ఆ పూటే మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండడంతో ఈ అక్రమాలు బయటపడే అవకాశం ఉండదని చెబుతున్నారు. ఇన్ని సెంటర్లలో పరీక్షలు జరుగుతుంటే కేవలం 4 ఫ్లయింగ్ స్క్వాడ్లే నియమించడం చూస్తే ప్రాక్టికల్స్ ఎంత పారదర్శంగా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.


సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తాం

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలను బిగించాలని ఆదేశాలు జారీ చేశాం. ఆర్‌ఐఓ కార్యాలయం నుంచి ప్రాక్టికల్స్‌ను పర్యవేక్షిస్తాం. ప్రాక్టికల్స్ కోసం 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 4 డీఈసీ కమిటీ సభ్యులను నియమించాం. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే బోర్డు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– ఆదూరు శ్రీనివాసులు, ఆర్‌ఐఓ

పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్

- నేటి నుంచి ఈ నెల 19వ తేదీ వరకు
- హాజరుకానున్న 23,507 మంది విద్యార్థులు
- 121 సెంటర్ల ఏర్పాటు
- ఫిర్యాదులకు కంట్రోలు రూం ఏర్పాటు
- 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు



మాట్లాడుతున్న ఆర్‌ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ జనరల్ ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు ఆర్‌ఐఓ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్‌ఐఓ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంటర్ జనరల్ ప్రాక్టికల్స్ ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు జరుగుతాయన్నారు. 20వ తేదీ రిజర్వ్‌గా ఉంటుందన్నారు. ఈ పరీక్షకు జిల్లాలో 23,507 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రాక్టికల్స్ ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో 121 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు హాల్ టికెట్లను ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ప్రాక్టికల్స్ జరిగే కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రాక్టికల్స్‌కు 121 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 121 మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లను నియమించినట్లు చెప్పారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లుగా ప్రైవేట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్‌ను నియమించారన్నారు. 4 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందుగా ఆన్‌లైన్ ద్వారా ప్రశ్నపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష ముగిసిన వెంటనే మూల్యాంకనం చేసి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కంట్రోలు రూంను ఏర్పాటు చేశామన్నారు. 0861-2320312 నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే అందుబాటులోకి వస్తారన్నారు. ఫీజులతో ముడిపెట్టకుండా విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేయాలని లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డీవీఈఓ మధుబాబు, డీఈసీ సభ్యులు దీన్‌దయాళ్, వేణుగోపాల్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో అర్ధరాత్రి కీచకకాండ

- మారణాయుధాలతో ముగ్గురు ఆగంతకుల కలకలం
- గోడ దూకి వసతిగృహంలో దూరి విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తన
- భయంతో వణికిపోయిన బాలికలు
- విషయం తెలిసి పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రుల ఆందోళన
- వసతిగృహం నుంచి ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు



బిడ్డలు కోసం గేటు వద్ద ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు

కావలి: పట్టణంలోని ముసునూరు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలోకి శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ముసుగులు ధరించిన ముగ్గురు ఆగంతకులు మారణాయుధాలతో ప్రవేశించి కీచక కాండకు తెగబడ్డారు. విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించి తీవ్ర భయాందోళనలకు గురి చేశారు. వసతిగృహం వెనుక వైపున ఉన్న గోడదూకి హాస్టల్‌లోకి ప్రవేశించిన దుండగులు విద్యార్థినుల గదుల్లోకి దూరి అలజడి సృష్టించడంతో వారు భయంతో బిక్క చచ్చిపోయారు. ముఖం కనిపించకుండా ముసుగులు ధరించడంతోపాటు చేతుల్లో కత్తులు ఉండడంతో భయంతో వణికిపోయారు. విద్యార్థినుల అరుపులతో ఆగంతకులు పారిపోయినట్లుగా తెలుస్తోంది. అయితే ఈ ఘటనకు సంబంధించిన విషయాన్ని పాఠశాల ప్రిన్సిపల్‌తో సహా పోలీసులు కూడా అత్యంత గోప్యంగా ఉంచారు. విద్యార్థినులను మీడియాతో కూడా మాట్లాడనివ్వకుండా అడ్డుపడ్డారు.

మూడు గంటల సేపు పైశాచికత్వం

ఆగంతకులు ముగ్గురు సుమారు మూడు గంటల సేపు విద్యార్థినులకు నరకం చూపించినట్లుగా తెలిసింది. రాత్రి 12 గంటలు దాటిన తర్వాత హాస్టల్‌లోకి ప్రవేశించిన ఆగంతకులు డైనింగ్ హాల్‌లో పడుకున్న విద్యార్థులను తీవ్ర ఆందోళనకు గురిచేశారు. వారు కప్పుకున్న దుప్పట్లు లాగేసి, జడలు లాగుతూ వేకువన 3 గంటల వరకు పైశాచికత్వం ప్రదర్శించారు. అరిచిన కొందరి విద్యార్థులను చెంపపై కొట్టినట్లు తెలుస్తోంది. మూడు గంటల ప్రాంతంలో హాస్టల్ నుంచి తిరిగి వెళ్లిపోయారు.

పాఠశాలకు చేరుకున్న తల్లిదండ్రులు

కస్తూర్బాలో 262 మంది బాలికలు ఉన్నారు. వీరు 6వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు వీరంగం చేయడంతో భయంతో వణికిపోయిన విద్యార్థినులు తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు ఉదయాన్నే హుటాహుటిన వసతిగృహం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయులు, సిబ్బంది నుంచి సరైన సమాధానం రాకపోవడం, చిన్నారులు భయంతో మాట్లాడే పరిస్థితుల్లో కూడా లేకపోవడంతో తల్లిదండ్రులు కూడా భయపడిపోయారు. హాస్టల్‌లో ఉంటే బాలికలకు రక్షణ లేదంటూ ఖాళీ చేయించి ఇళ్లకు తీసుకెళ్లిపోయారు.

భద్రతా వైఫల్యం.. పాఠశాల యజమాన్యం నిర్లక్ష్యం

కస్తూర్బాలో 262 మంది విద్యార్థినులు ఉంటే.. కనీసం పాఠశాల యాజమాన్యం వారి భద్రతపై ఎటువంటి చర్యలు తీసుకోకవడం విమర్శలకు తావిస్తోంది. రెండో శనివారం కావడంతో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితోపాటు వసతి గృహం వార్డెన్ సైతం పాఠశాలల ప్రాంగణంలో లేకపోవడం చూస్తే విద్యార్థునుల భద్రత పట్ల ఈ ప్రభుత్వం, పాఠశాల యాజమాన్యం ఎటువంటి శ్రద్ధ తీసుకుంటుందో అర్థమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయి. ముగ్గురు ఆగంతకులు తమ గదుల్లోకి దూరి అలజడి సృష్టించారని విద్యార్థినులు చెబుతున్నప్పటికీ ప్రిన్సిపల్ మాత్రం ఒక్కడే వచ్చాడంటూ ఈ ఘటన తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత మంది విద్యార్థినులకు ఒకే ఒక వాచ్‌మెన్‌ను నియమిస్తే.. అతను సైతం ఆ సమయంలో ఎటుపోయాడో తెలియడం లేదు. ఈ ఘటన కస్తూర్బా యాజమాన్యం నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. ఈ విషయాన్ని పోలీసులు, కళాశాల యాజమాన్యం గోప్యంగా ఉండడం గర్హనీయం. పోలీసులు విచారణ జరపడంతో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంతోపాటు నిందితులు అరెస్ట్ చేయాల్సిన అవసరం ఉందని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

క్లుప్తంగా

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- కత్తులు, కర్రలతో దాడులు
- ముగ్గురికి తీవ్రగాయాలు



ముఖంపై గాయం

మనుబోలు: మండలంలోని బద్దెవోలు గ్రామం దళితవాడలో ఆదివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. కత్తులు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని వీధి కుళాయి వద్ద కొందరు దుస్తులు ఉతుకుతుండటంతో ఆ నీళ్లు తమ ఇళ్ల ఆవరణలోకి వస్తున్నాయని ఆరోపిస్తూ.. కుళాయిని డమ్మీ (నీళ్లు రాకుండా) చేయాలని ఓ వర్గం వారు ఆదివారం పట్టుబట్టారు. పంచాయతీ కుళాయిని డమ్మీ ఎలా చేస్తారంటూ మరో వర్గం వాదనకు దిగింది. దీంతో వివాదం చెలరేగి రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. కత్తులు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకోవడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరికి తలపై, మరో వ్యక్తికి ముఖంపై తీవ్ర గాయమైంది. వారిని చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దళితవాడలో ఉద్రిక్తత చోటుచేసుకున్న నేపథ్యంలో మనుబోలు ఎస్సై శివరామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

పూరిల్లు దగ్ధం

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ పూరిల్లు దగ్ధమైన ఘటన ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నెల్లూరు రమణమ్మ తన మనవడికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో చికిత్స చేయించేందుకు బయటకు వెళ్లింది. ఈ సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. పూరిల్లు దగ్ధమైంది. సుమారు రూ.30 వేల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లుగా బాధితురాలు తెలిపింది.

వ్యక్తి మృతదేహం గుర్తింపు

పొదలకూరు: మండలంలోని డేగపూడిరాజుపాళెం వద్ద దినేష్ చక్రవర్తి (35) అనే వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. పట్టణానికి చెందిన దినేష్ ఈనెల 4వ తేదీ నుంచి కనిపించడం లేదని పోలీసులకు బాధిత తండ్రి నారాయణ నాయుడు ఫిర్యాదు చేశారు. ఎస్సై హనీఫ్ గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మృతదేహాన్ని గుర్తించారు. అతను నాలుగురోజుల క్రితం చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 108
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 224
లేయర్ చికెన్	: 145

నేరపురి

కూటమి ప్రభుత్వంలో జిల్లాలో శాంతిభద్రతలు క్షీణించాయి. అసాంఘిక శక్తులు రెచ్చిపోతున్నాయి. ఈ నేపథ్యంలో నేరాల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. హత్యలు, దొంగతనాలు, దోపిడీలు, ఘర్షణలు, లైంగికదాడులు ప్రజలను కలవరపెడుతున్నాయి. చిన్న వివాదాలకే చంపుతున్న పరిస్థితులున్నాయి.

- కూటమి ప్రభుత్వంలో క్షీణించిన శాంతిభద్రతలు
- రోజురోజుకూ పెరుగుతున్న నేరాలు
- హత్యలతో కలకలం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న నెల్లూరు పోలీసులు (ఫైల్)



గత నెలలో హత్యకు గురైన వ్యక్తి

నెల్లూరు సిటీ: ప్రశాంతతకు మారుపేరైన సింహపురి క్రమేపీ నేరపురిగా మారుతోంది. పాతకక్షల నేపథ్యంలో ఒకరు.. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంకొకరు.. ఇతరత్రా కారణాలతో మరొకరు ప్రత్యర్థులను హత్య చేస్తున్నారు. కడుపున పుట్టిన వారు, జీవితాంతం బాసటగా నిలుస్తామన్నవారే చంపుతున్నారు. కిరాయి సంస్కృతి హెచ్చుమీరుతోంది. బాలికలకు ఇంటా, బయట భద్రత కరువైంది. కొందరు కామాంధులు వారి జీవితాలను నాశనం చేస్తున్నారు. లైంగికదాడి యత్నాలు, వేధింపులు, హత్యాయత్నాలు, దాడులు, దోపిడీల గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరమే లేదు. నేరాలను కట్టడి చేయడంలో పోలీసులు విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. పోలీసుల నిఘా, గస్తీ కేవలం సైరన్‌లకే పరిమితమైనట్లు తెలుస్తోంది. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు కత్తులతో స్వైర విహారం చేస్తున్నారు. అధికార పార్టీ నేతలు వారిని పెంచిపోషిస్తుండటంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది. పోలీస్ లాఠీలకు రాజకీయ నాయకులు సంకెళ్లు వేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

కొరవడిన భద్రత

బాలికలు, యువతులు, మహిళలకు భద్రత కొరవడింది. నెల్లూరు సంతపేట పరిధిలోని ఓ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతూ హాస్టల్లో ఉంటున్న బాలికకు మాయమాటలు చెప్పిన ఓ వ్యక్తి ఆమెను బయటకు తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. సాయం ముసుగులో ఒకతను ఆమెను తన ఇంటికి తీసుకెళ్లి పలుమార్లు లైంగికదాడి చేశాడు. ఓ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న బాలికపై లైంగికదాడి జరిగింది. తాజాగా నెల్లూరు రూరల్ మండల పరిధిలోని ఓ స్కూల్లో బాలికపై ఓ వ్యక్తి అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ప్రేమ పేరిట ఓ వ్యక్తి నమ్మించి ఆమెను సర్వం దోచుకుని వదిలేశాడు. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. బలమైన సెక్షన్లతో కేసులు నమోదు చేస్తున్నప్పటికీ దాడులు ఆగడం లేదు.

రెండు నెలల వ్యవధిలో..

- కొండాపురం మండలంలో తిరుపాల్ (55) అనే వ్యక్తిని ఒకతను దారుణంగా హత్య చేసి 25 మేకలను అపహరించాడు.
- కలువాయి మండల పరిధిలోని పల్లంకొండలో గోపీ అనే యువకుడిని దారుణంగా హత్య చేశారు.
- కొడవలూరు మండలం టపాతోపు వద్ద హిజ్రా నాయకురాలు హాసినీని దారుణంగా చంపారు.
- విభేదాల నేపథ్యంలో ఉదయగిరిలో ఇందిరను భర్త హత్య చేశాడు.
- రంగనాయకులపేట రైల్వేగేటు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్య.
- కావలిలో ఓ యువకుడు నమ్మకంగా ఉంటూ యజమాని భార్యను హత్య చేసి ఆపై లైంగిక వాంఛ తీర్చుకున్నాడు.
- నార్తుమోపూరులో కార్తీక్ అనే యువకుడిని అకారణంగా దాడి చేసి చంపారు.
- మద్యం తాగొద్దని వారించినందుకు తూకుమానుమిట్టకు చెందిన అహ్మద్ రసూల్‌ను అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు హత్య చేశారు.
- కొండాయపాళెంలో మద్యం మత్తులో వీరంగం చేస్తున్న వ్యక్తిని వారించిన అభిషేక్ అనే యువకుడు హత్యకు గురయ్యాడు.
- కొడవలూరు మండలం మిక్కిలింపేట వద్ద బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన స్టీల్ వ్యాపారి రమేష్ (50) దారుణ హత్యకు గురయ్యాడు. ఆస్తి కోసమే రెండో కుమారుడు, భార్య రూ.5 లక్షలిచ్చి చంపించారు.
- శ్రీనివాసనగర్‌లో కుమార్తెనిచ్చి పెళ్లి చేయలేదనే అక్కసుతో మహబూబ్‌బాషా అనే వ్యక్తిని ఒకతను చంపాడు.
- మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని తాతపై మనవడు దాడి చేశాడు. చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందాడు.
- తాజాగా నెల్లూరు ఉడ్‌హౌస్ సంఘంలో సస్పెక్ట్ షీటర్ కళ్యాణ్‌ను పాతకక్షల నేపథ్యంలో దుండగులు దారుణంగా హత్య చేశారు.



అభిషేక్ మృతదేహం (ఫైల్)



హత్యకు గురైన కల్యాణ్ (ఫైల్)

వివాహిత అదృశ్యం

నెల్లూరు సిటీ: వివాహిత అదృశ్యమైన ఘటనపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. మొహికర్ సమతేష్, కరుణ దంపతులు బీవీనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి గతేడాది సెప్టెంబర్‌లో వివాహమైంది. కరుణ ఆదివారం ఉదయం చర్చికి వెళ్తున్నానని ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆమె కోసం గాలించారు. జాడ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు?



దుర్గంపై వెలుగులు

ఉదయగిరి: ఉదయగిరి దుర్గంపై గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుగుతున్నాయా? అని స్థానికులు అనుమానిస్తున్నారు. రెండురోజుల నుంచి దుర్గంపై రాత్రి వేళల్లో వెలుగులు కనిపిస్తున్నాయి. గతంలో అనేకమంది నిధుల కోసం తవ్వకాలు జరిపి పోలీసులకు చిక్కిన సందర్భాలున్నాయి. శనివారం రాత్రి దుర్గంపై వెలుగులు కనిపించడంతో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్నారా? లేక ఇతర కారణాలున్నాయా? అనే సందేహం స్థానికుల్లో నెలకొంది. పోలీసులు దృష్టి సారించి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాల్సి ఉంది.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.40
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.18

చంపేస్తాడన్న భయంతోనే హత్య

- యువకుడి హత్య కేసులో విచారణ వేగవంతం
- పోలీసుల అదుపులో పలువురు నిందితులు?

నెల్లూరు సిటీ: నెల్లూరు నగరంలో కలకలం రేకెత్తించిన కల్యాణ్ అనే యువకుడి హత్య కేసులో నెల్లూరు నవాబుపేట పోలీసులు విచారణ వేగవంతం చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించి పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పాతకక్షల నేపథ్యంలో కల్యాణ్ తమను చంపేస్తాడన్న భయంతో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు విచారణలో వారు వెల్లడించినట్లు తెలుస్తోంది. సేకరించిన సమాచారం మేరకు.. ఉడ్‌హౌస్ సంఘానికి చెందిన కల్యాణ్ అలియాస్ చిన్నాపై నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్టెడ్ షీట్ ఉంది. తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ మాజీ కార్పొరేటర్ ఫైనాన్స్ కంపెనీలో జాకీర్‌హుస్సేన్‌నగర్‌కు చెందిన అజయ్ పనిచేస్తున్నాడు. అజయ్‌కు కల్యాణ్‌కు మధ్య పాత గొడవలున్నాయి.

ఏం జరిగిందంటే..

గతనెలలో జరిగిన ఏటిపండగకు అజయ్, రంగనాయకులపేటకు చెందిన జావీద్‌లు వెళ్లారు. కల్యాణ్ మద్యం తాగి అక్కడ గొడవ చేస్తుండగా మహిళలున్నారని, వెళ్లిపోవాలని అజయ్, జావీద్‌లు అతడ్ని కోరారు. ఈ విషయమై వారి మధ్య ఘర్షణ జరిగింది. కోపోద్రిక్తుడైన కల్యాణ్ వారిపై దాడిచేశాడు. అజయ్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో విభేదాలు తారస్థాయికి చేరాయి. అజయ్‌ను చంపుతామని అతడి స్నేహితులకు కల్యాణ్ ఫోన్ చేసి బెదిరించసాగాడు. ఐదురోజులుగా బెదిరింపులు ఎక్కువవడంతో కల్యాణ్ ఎక్కడ చంపేస్తాడేమోనన్న భయం అజయ్‌ను వెంటాడింది. ఈ విషయాన్ని తన తన స్నేహితులైన కుసుమ దళితవాడకు చెందిన ఉదయ్‌కిరణ్, సత్యనారాయణపురానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ సురేంద్ర, భగత్‌సింగ్ కాలనీకి చెందిన పెయింటర్ శివ, మన్సూర్ నగర్‌కు చెందిన ఏసీ టెక్నీషియన్ అజిత్‌లకు తెలియజేశాడు. కల్యాణ్‌ను హతమారిస్తే తాను ప్రశాంతంగా ఉండొచ్చని లేనిపక్షంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని అజయ్ చెప్పడంతో అందరూ కలిసి హత్యకు పథకరచన చేశారు. నాలుగురోజులుగా కల్యాణ్ కదలికలపై నిఘా ఉంచారు. శనివారం రాత్రి కల్యాణ్ తన స్నేహితులు, శీనా, నరసింహ, మరో ఇద్దరితో కలిసి ఉడ్‌హౌస్ సంఘం ప్రాంతంలో మద్యం తాగుతున్నాడని తెలుసుకుని అజయ్ తన స్నేహితులతో రెండు మోటార్‌బైక్‌లపై మారణాయుధాలతో ఆ ప్రాంతానికి చేరుకున్నాడు. మూకుమ్మడిగా కల్యాణ్‌పై దాడి చేసి కత్తులతో నరికి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు తెలిసింది.

పలువురిని..

నగర డీఎస్పీ పి.సింధుప్రియ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధాన నిందితుడు అజయ్‌తోపాటు, శివ, సురేంద్ర, అజిత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరో నిందితుడి కోసం గాలిస్తున్నట్లు సమాచారం. కల్యాణ్ మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు ఆదివారం శవపరీక్ష నిర్వహించి బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

- నేడు ఫైనల్స్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): హాకీ ఎస్పీఎస్సార్ నెల్లూరు జిల్లా ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 15వ సీనియర్ ఏపీ మహిళా హాకీ పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. లీగ్ పోటీలకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు – గుంటూరు జట్ల మధ్య జరిగిన పోటీలో 3 – 0 గోల్స్ తేడాతో నెల్లూరు జట్టు, అనంతపురం – తిరుపతి జట్ల మధ్య జరిగిన పోటీలో 1 – 0 గోల్‌తో అనంతపురం జట్టు విజయం సాధించాయి. అనకాపల్లి – నెల్లూరు జిల్లా జట్ల మధ్య జరిగిన పోటీలో 3 – 0 గోల్స్ తేడాతో అనకాపల్లి జట్టు, విశాఖపట్నం – కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 8 – 0 గోల్స్ తేడాతో విశాఖపట్నం జట్టు గెలుపొందింది. శ్రీసత్యసాయి – శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన పోటీలో శ్రీకాకుళం జట్టు 2 – 1 గోల్స్ తేడాతో, ప్రకాశం – ఎన్టీఆర్ జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జట్టు 1 – 0 గోల్‌తో విజయం సాధించింది.

సెమీఫైనల్స్‌లో..

వైఎస్సార్ – కాకినాడ జట్ల మధ్య జరిగిన మొదటి సెమీఫైనల్స్‌లో 5 – 4 గోల్స్ తేడాతో వైఎస్సార్ జట్టు, అనంతపురం – అనకాపల్లి జట్ల మధ్య జరిగిన రెండో సెమీఫైనల్స్‌లో 3 – 2 గోల్స్ తేడాతో అనంతపురం జట్టు గెలుపొందాయి. ఫైనల్ పోరు వైఎస్సార్ – అనంతపురం జట్ల మధ్య సోమవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ పి.థామస్‌పీటర్ తెలిపారు. ఈ పోటీల్లో హాకీ ఎస్పీఎస్సార్ కార్యదర్శి జగన్‌మోహన్, వివిధ జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



హాకీ ఆడుతున్న క్రీడాకారిణులు



నులిపురుగుల వల్ల రక్తహీనత, నీరసం, కడుపులో నొప్పి వంటి సమస్యలొస్తాయి. ఒక్క మాత్రతో పిల్లల శరీరంలోని పేగుల్లో చేరిన నులిపురుగులకు చెక్ పెట్టొచ్చని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లోని పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేసేందుకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది.

‘నులి’పేద్దాం

- ఒక్క మాత్రతో నులిపురుగులకు చెక్
- డీ వార్మింగ్ డే నేడు
- రక్తహీనత, నీరసం, ఆకలి లేకపోవడం వాటి వల్లే..
- 19 ఏళ్లలోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలు
- పంపిణీకి వైద్యారోగ్య శాఖ ఏర్పాట్లు

నెల్లూరు(అర్బన్): ఆల్బెండజోల్ అనే ఒకే ఒక్క మాత్ర నులిపురుగులను నిర్మూలిస్తుంది. ప్రధానంగా పిల్లల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఇందువల్ల సూక్ష్మక్రిములు సులభంగా పొట్టలో చేరిపోతాయి. ఆకలి మందగించడం, నీరసం, రక్తహీనత, తగినంత ఎదగలేకపోవడం, కడుపులో నొప్పిగా ఉండటం ఇలాంటి లక్షణాలు నులిపురుగులు వల్లే ఎక్కువగా పిల్లల్లో కనిపిస్తాయి. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై నులిపురుగులు ప్రభావాన్ని చూపుతున్న కారణంగా వాటిని నివారించేందుకు ప్రభుత్వం జాతీయ నులిపురుగుల నివారణ (డీ వార్మింగ్ డే) దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10వ తేదీన జరుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 19 ఏళ్లలోపు విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు ఇవ్వనున్నారు.



ఇటీవల ఉదయగిరిలో వాల్‌పోస్టర్లను విడుదల చేసిన అధికారులు

నష్టాలిలా..

ప్రధానంగా పిల్లల్లో రౌండ్ వార్మ్, హుక్ వార్మ్, టేప్ వార్మ్‌లుగా పిలవబడే మూడు రకాల నులిపురుగులుంటాయి. వీటి వల్ల వారిలో నీరసం పెరిగి చదువుపై దృష్టి సారించలేరు. దీర్ఘకాలికంగా జబ్బుతో కూడిన విధంగా ఉంటారు. పెరుగుదల ఆలస్యమవుతుంది. ఈ నేపథ్యంలో పిల్లల్లో నులిపురుగులు చేరకుండా ఉండాలంటే పరిశుభ్రమైన మరుగుదొడ్లను వినియోగించాలి. బహిరంగ మలవిసర్జన చేయరాదు. భోజనం, ఇతర ఆహార పదార్థాలు తీసుకునే ముందు చేతులను పరిశుభ్రంగా సబ్బుతో కడగాలి. చేతి, కాలి గోటివేళ్లను ఎప్పటికప్పుడు కట్ చేయాలి. సురక్షిత తాగునీటిని వినియోగించాలి. ఆహార పదార్థాలను పూర్తిగా కప్పే మూతలను ఉంచాలి. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పచ్చగడ్డి లాంటి వాటి మీద నడిచే సమయంలో చెప్పులు ధరించాలి. ఇందువల్ల క్రిములు కాళ్ల ద్వారా శరీరంలోకి ప్రవేశించవు.

పరిశుభ్రతే కీలకం



పిల్లల్లో నులిపురుగులను నివారిస్తేనే వారు హుషారుగా ఉంటారు. లేదంటే నీరసంతో ఉంటారు. చదువుపై ధ్యాస పెట్టలేరు. నులిపురుగుల వల్ల చిన్నపిల్లల్లో మలవిసర్జన చేసే చోట దురద వస్తుంది. రక్తహీనత ఏర్పడుతుంది. సంవత్సరానికి రెండు దఫాలు ఈ మాత్ర వేస్తే పిల్లల్లో నులిపురుగులను నివారించవచ్చు. అలాగే పరిశుభ్రత కీలకం. అందువల్ల తల్లిదండ్రులు తమ బిడ్డలకు ఈ మాత్రను ఇవ్వాలి. వైద్యశాఖ తరఫున వంద శాతం పిల్లలకు ఈ ఆల్బెండజోల్ మాత్రలను ఇస్తాం.

– డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌ఓ

జిల్లాలో..

జిల్లాలోని 2,933 అంగన్‌వాడీ సెంటర్లలో ఒకటి నుంచి ఐదేళ్లలోపు వయసున్న 1,32,703 మందికి, 2,600 ప్రభుత్వ పాఠశాలల్లోని 1,94,952 మంది, 811 ప్రైవేట్ పాఠశాలల్లోని 1,68,549 మంది, 60 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 11,352 మంది, 140 ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో 43,592 మంది, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరం చదువుతున్న సుమారు 24,658 మంది, మరో 57,580 మంది కలిపి మొత్తం 6,33,386 మంది చేత మాత్రలు మింగించనున్నారు. ఒకటి నుంచి రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్రను మాత్రమే వేస్తారు. దానిని కూడా నలగ్గొట్టి నీటిలో మిక్స్ చేసి ఇస్తారు. 3 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఫుల్ మాత్ర ఇస్తారు. వీరు మాత్రను నాలుకపై ఉంచుకుని చప్పరించాలి.